క్లుప్తంగా

ఏలేరులో తగ్గిన నీటినిల్వలు

ఏలేశ్వరం: ఎండలకు ఏలేరు ప్రాజెక్టులో నీటిని ల్వలు తగ్గుముఖం పట్టాయి. గత కొన్ని రోజులుగా ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో అడపా దడపా వర్షాలు పడుతున్నా ఎండ తీవ్రతకు నీటినిల్వలు తగ్గుతున్నాయి. మంగళవారం నాటికి ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు 76.66 మీటర్లు, 24.11 టీఎంసీలకు 9.86 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దీంతో ప్రాజెక్టు దిగువ ఆయకట్టు, తిమ్మరాజుచెరువు, పంపాకు నీటిని ల్వలు నిలిపివేశారు. విశాఖకు 200 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు.

జగన్ పాలన సువర్ణయుగం



కేక్ కట్ చేస్తున్న నాయకులు

గండేపల్లి: రానున్న తరాలకు వైఎస్సార్ సీపీ పాలన సువర్ణాధ్యాయమని పార్టీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీపీలు అత్తులూరి నాగబాబు, చలగళ్ల దొరబాబు (పద్మనాభుడు) పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ గెలుపొంది నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కేక్ కట్ చేసి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

చిత్రలేఖనంపై అవగాహన

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎం.రాము విద్యార్థులకు చిత్రలేఖనంలో మెళకువలను నేర్పించారు. విద్యార్థులకు కాగితాలతో బొమ్మలు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. స్టడీసర్కిల్ ట్రైనర్ మణికంఠ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరుకావాలన్నారు.

సీల్డ్ టెండర్లకు దరఖాస్తులు

తుని: ఆర్టీసీ డిపో పరిధిలోని కత్తిపూడి బస్టాండ్‌లో ఖాళీ దుకాణాలు, స్థలంలో వ్యాపారం నిమిత్తం వ్యాపారుల నుంచి సీల్డ్ టెండర్లు కోరుతున్నట్టు మేనేజరు కె.కిరణ్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. టెండర్ దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ వరకూ డిపోలోని కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు స్వీకరిస్తామని, పూర్తి చేసిన దరఖాస్తులను 31వతేదీ 2 గంటల లోపు అందజేయాలన్నారు. అదే రోజు సాయంత్రం కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించి టెండర్లు ఖారారు చేస్తామన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి

తుని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిరంకుశ విధానాలతో దళితులపై దాడులు జరుగుతున్నాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ఆరోపించారు. మంగళవారం తుని పట్టణం కొండవారిపేట కమ్యూనిటీ హాలు కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాల్యాద్రి మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళిత, గిరిజనుల చట్టాలను నీరు గారిస్తున్నాయని, ప్రతిపక్షాలు నోరు మెదపడం లేదన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో దళితులపై జరుగుతున్న ఆరాచకాలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. దళిత గిరిజన చట్టాలను పక్కాగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నాయకులు లోవరాజు, లక్ష్మణ్, చక్రధర్, రాము పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిడదవోలు వాసికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. నిడదవోలుకు చెందిన భార్య, భర్తలు గరికపాటి శ్రీను, గౌతమి, కుమారుడు యశ్వంత్‌తో కలిసి తెల్లవారుజామున మోటారుసైకిల్‌పై అన్నవరం వెళ్లారు. అక్కడ వ్రతమాచరించుకుని, స్వామివారి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో మల్లేపల్లి శివారు కరుణకుమార్ దాబా సమీపంలోకి వచ్చేసరికి శ్రీనుకు కునుకుపాట్లు పడడంతో ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో శ్రీనుకు గడ్డం, కుడి కన్ను పైభాగం లోను తీవ్ర గాయమైంది. ప్రయాణికులు, స్థానికులు అతనిని గండేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోడి పందేలపై దాడి

జగ్గంపేట: కోడి పందేలు ఆడుతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఇర్రిపాక గ్రామ శివారు పామాయిల్ తోటలో కోడి పందేలు ఆడుతున్నట్టు సమాచారం అందడంతో తమ సిబ్బందితో దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2200 నగదు స్వాధీనం చేసుకుని బుధవారం పెద్దాపురం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ఇరువర్గాలపై కేసు

కిర్లంపూడి: రెండు వర్గాల మధ్య జరిగిన వివాదంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేలంకలో రెండు వర్గాల మధ్య భూమికి సంబంధించి వివాదం జరిగింది. పోలీసులకు అందిన సమాచారం మేరకు అక్కడకు చేరుకున్నారు. గ్రామానికి చెందిన 14 మందిపై సోమవారం అర్ధరాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ సిబ్బందితో పర్యవేక్షించామన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- గ్రామాల్లో 'వలంటీర్లకు వందనం'

ఏలేశ్వరం: ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచిన వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక వేదిక ఫంక్షన్ హాలులో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మండల, అర్బన్ పరిధిలోని వలంటీర్లను సేవావజ్ర, సేవారత్న అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాలను అందించేందుకు వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. సీఎం జగన్ ఆశయసాధనకు కృషి చేస్తున్న వలంటీర్లు సేవలు హర్షణీయమన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా పథకాలను అందిస్తున్న ప్రభుత్వం తమదే నన్నారు. వలంటీర్లు తమ సేవలు మరింత విస్తతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, నీరుకొండ సత్యనారాయణ, బదిరెడ్డి గోవిందు, అడపా పార్థసారధి, చిక్కాల లక్ష్మణరావు, సామంతుల సూర్యకుమార్, బొదిరెడ్డి గోపి తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపునిచ్చేది అవార్డులే

తుని రూరల్: ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు గుర్తింపునిచ్చేది అవార్డులేనని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. మంగళవారం రేఖవానిపాలెం, కుమ్మరిలోవ, డి.పోలవరంలో ఎంపీడీఓ విద్యాసాగర్ కుమార్ ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ వలంటీర్లు సేవలను ప్రజలు కూడా గుర్తించేలా సేవామిత్ర, సేవారత్న, సేవ వజ్ర అవార్డులిచ్చి సన్మానిస్తున్నట్టు తెలిపారు. వైస్ ఎంపీపీలు చిటికెల సత్యవతి, చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, మాజీ సర్పంచ్‌లు చింతల వెంకటరమణ, జక్కాన రామచంద్రరావు, ఎస్.రామచంద్రరావు, నాయకులు చిటికెల వరహాలబాబు, డబ్బూరి నాగశివ, పరవాడ లోవరాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



గోకవరంలో అవార్డులు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

వలంటీర్లు సంక్షేమ సారథులు : ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: వలంటీర్లు ప్రతి కుటుంబానికి సంక్షేమ సారథులుగా సేవలందిస్తున్నారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని 20 సచివాలయాల్లో 276 మంది వలంటీర్లు ఉండగా ఇద్దరు సేవావజ్ర, ఐదుగురు సేవారత్న అవార్డులకు, 269 మంది సేవామిత్రలకు ఎంపికయ్యారు. వీరందరికీ ఎమ్మెల్యే చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లుకు సముచిత గౌరవం లభిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. వీరి సేవలను ప్రభుత్వం గుర్తిస్తూ ఏటా గౌరవిస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేస్తూ ప్రజలకు సేవలందించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేగా గెలుపొంది నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో పార్టీ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, చింతల అనిల్‌కుమార్, నరాలశెట్టి నర్సయ్య, గుల్లా ఏడుకొండలు, తోలేటి రాంప్రసాద్, బద్దిరెడ్డి అప్పన్నదొర, వైస్ ఎంపీపీ గోకాడ చిట్టిబాబు, ఎంపీడీఓ కెఎస్ఎస్ఎన్ మూర్తి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తొండంగి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందించడంలో కీలక పాత్ర పోషిస్తూ ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు ఘన సన్మాన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఎంపీడీఓ పసపులేటి సతీష్, వైస్ ఎంపీపీ యాదాల రమణ, ప్రజాప్రతినిధులు కలిసి పెరుమాళ్లపురం గ్రామ సచివాలయం1, 2కు చెందిన 54 మంది వలంటీర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు బద్ది నూకరాజు, యాదాల కృష్ణ, ఉపసర్పంచ్ పెరుమాళ్ల లోవరాజు, యాదాల చక్రి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: సింహాద్రిపురంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు నంది వెంకన్న, కాలపురెడ్డి కాశీవిశ్వనాథం వలంటీర్లకు శాలువా కప్పి, ప్రశంస పత్రాలు అందజేశారు. నంది బాలకృష్ణ, వైస్ సర్పంచ్ నంది రాజారావు, కందా జి.ఈశ్వరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



పెరుమాళ్లపురంలో వలంటీర్లను సన్మానించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు



డి.పోలవరంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ రాము, వైస్ ఎంపీపీలు.



సింహాద్రిపురంలో వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- అచ్చంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

శంఖవరం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం అచ్చంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, గత నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందకపోతే వెంటనే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. రానున్న కాలంలో ఈ పథకాలన్నీ అమలవాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొట్టా చైతన్య, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఉప సర్పంచ్ పల్లా సత్తిబాబు, కుండల శ్రీను, కురందాసు దేవుళ్లు, లొడగల రాజారావు, పల్లా అప్పల రాజు, బొట్టా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

చలివేంద్రం ప్రారంభం

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో దాత కంబాల శ్రీనివాస్‌రావు సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

గోకవరానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన తుపాకుల గణేష్, తుపాకుల బాపనమ్మ, మేడిశెట్టి సత్యవేణి, కంచర్ల అవినాష్‌లు పార్టీలోకి చేరగా వీరికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు వీరబాబు, ప్రసాద్, సూరారెడ్డి, అనిల్ కుమార్, వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

రోడ్డు ప్రమాదంలో మండల సర్వేయర్‌కు గాయాలు

గండేపల్లి: రోడ్డు ప్రమాదంలో మండల సర్వేయర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గండేపల్లి మండలంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.లక్ష్మి యల్లమిల్లిలో విధులు నిర్వహించుకుని తన అసిస్టెంట్ షాబుతో కలిసి మోటారుసైకిల్‌పై సింగరంపాలెం వెళుతుండగా గండేపల్లిలో కార్పొరేషన్ బ్యాంక్ సమీపంలో ఉన్న వినాయకుని ఆలయం వద్ద ఆగి ఉన్న కారును ఢీకొన్నారు. ఆమె కింద పడిపోవడంతో తలకు గాయమైంది. వెంటనే ఆమెను గండేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు ఐ.సౌమ్య, ఎం.దీప్తి ప్రథమ చికిత్సం అందజేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం మెరుగ్గా ఉందన్నారు. డీటీ సరిత, ఆర్ఐ ప్రదీప్, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది హాస్పటల్‌కి చేరుకుని ఆమె పరిస్థితిని అడిగితెలుసుకున్నారు.

కౌలు కార్డులు తప్పనిసరిగా పొందాలి

తుని రూరల్: కౌలుదారులకు కౌలు కార్డులు తప్పనిసరిగా పొందాలని మండల వ్యవసాయాధికారి బి.అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం వి.కొత్తూరు, చేపూరు గ్రామాల్లో కౌలుదారుల సాగు హక్కుపత్రాల అవగాహన సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ సాగు హక్కు పత్రాలతో బహుళ ప్రయోజనాలు కౌలుదారులకు లభిస్తాయన్నారు. విత్తనాలు, ఎరువులు రాయితీలు, పంట రుణాలు పొందవచ్చని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ లభిస్తుందన్నారు. అదేవిధంగా పంట విక్రయించుకునేందుకు సీసీఆర్‌సీ కార్డులు అవసరమవుతుందన్నారు. గతంలో సీసీఆర్‌సీ కార్డులు పొందినవారంత రెన్యూవల్ చేయించుకోవాలని, అవసరమైన కొత్తవారికి కార్డులు జారీ చేస్తామన్నారు. సీసీఆర్‌సీలతో భూమి కౌలుకి ఇచ్చిన రైతులకు ఎటువంటి నష్టం, ప్రమాదంలేదన్నారు. మండల వ్యవసాయ సలహా మండల సభ్యుడు దుంగల నాగేశ్వరరావు, ఏఈఓ పి.జగ్గప్పారావు, వీఆర్వోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, కౌలుదారులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమం: కౌలుదారుల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం లోవకొత్తూరు, రాజుపేటల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసినట్టు ఏఓ అశోక్‌కుమార్ తెలిపారు. కౌలుదారులు, రైతులు పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.



వి.కొత్తూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఏఓ అశోక్‌కుమార్

కౌలు రైతులకు అండగా ప్రభుత్వం

కోటనందూరు: కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తుందని ఏఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కేపీ మల్లవరం, కే కొట్టాం గ్రామాల్లో కౌలు కార్డులపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ కౌలుకార్డుల జారీతో యజమాని రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. కౌలు కార్డుల జారీలో కౌలు చేసే రైతులను భూయజమాని రైతులు ప్రోత్సహించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు దొగ్గాబాబులు, కురసా మల్లయ్య, గాడి రమణబాబు, ఏఈఓ కేవీ శివకుమారి, వీఏఏలు రాజ్యలక్ష్మిజ్యోతి, ఆశపు నాగజ్యోతి పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ దాడులు

- ఒక ఎక్స్‌వేటర్, మూడు టిప్పర్ లారీలు సీజ్
- పలువురిపై కేసు నమోదు

గోకవరం: రంపయర్రంపాలెం పంచాయతీ పరిధిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై మంగళవారం రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి ఒక ఎక్స్‌వేటర్, మూడు టిప్పర్లను సీజ్ చేసి పలువురిపై కేసు నమోదు చేశారు. రీజనల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన అగ్రహారపు నాగమ్మకు చెందిన సర్వే నెంబర్ 389/16లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు, రవాణా జరుగుతుందని తమకు సమాచారం అందిందన్నారు. ఈ సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి, తవ్వకాలు నిర్వహిస్తున్న ఒక ఎక్స్‌వేటర్, రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేశామన్నారు. ఆ ప్రాంతంలో 4,827 క్యూబిక్ మీటర్లు గ్రావెల్ తవ్వకాలు నిర్వహించినట్టు అంచనా వేశామన్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్న గుమ్మళ్లదొడ్డికి చెందిన మిర్తిపాటి వెంకటనాగజ్యోతి స్వరూప్, భూ యజమాని, ఆపరేటర్లు, డ్రైవర్లు తదితరులపై కేసు నమోదు చేయాలని గోకవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎక్కడైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడిలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జియాలజిస్టు లక్ష్మీనారాయణ, రెవెన్యూ, పోలీసు, గనులశాఖ అధికారులు పాల్గొన్నారు.



గ్రావెల్ క్వారీపై దాడులు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

భూసార పరీక్ష.. పంటకు రక్ష

- తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడి
- రసాయన ఎరువుల వినియోగానికి దూరం
- చేతికి ఆరోగ్యకర పంటలు

ప్రత్తిపాడు: పూర్వం వేసవిలో భూమిని దుక్కి చేసేవారు. పెంటగెత్తం, చెరువు మట్టిని వేసి సారవంతం చేసేవారు. తద్వారా ఆరోగ్యకరమైన పంటలు చేతికి అందేవి. కాలం మారింది. రసాయనిక ఎరువుల వినియోగం పెరిగింది. భూమి నిస్సారమై, పంటలు కలిసి రావడం లేదు. ఏ పంట సాగు చేసినా పెట్టుబడే మిగులుతోంది. అందుకే భూసార పరీక్షలకు ప్రాధాన్యం పెరిగింది. మట్టి పరీక్షలు నిర్వహించి పోషక లోపాలు నివారించాలని, పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువులతో భూమిని సారవంతం చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. మట్టి పరీక్షల ప్రాధాన్యం వివరిస్తున్నారు. భూసార పరీక్షల నివేదిక ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు వస్తాయని చెబుతున్నారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో భూసార పరీక్షలు చురుగ్గా సాగుతున్నాయి. ఖరీఫ్ సాగు చేపట్టే నాటికి భూసార పరీక్షలను పూర్తి చేయనున్నట్టు వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతున్నారు.



ధర్మవరం గ్రామంలో మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ఇదీ పరిస్థితి..

ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని ప్రత్తిపాడు మండలంలో 12,120 ఎకరాలు, ఏలేశ్వరం మండలంలో 6,400 ఎకరాలు, శంఖవరం మండలంలో 3,737 ఎకరాలు, రౌతులపూడి మండలంలో 4,718 ఎకరాలు వెరసి 26,975 ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతుంది. నియోజకవర్గంలో ఎక్కువ శాతం జింకు లోపంతో ఉన్న నేలలే అధికంగా ఉన్నట్లు వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి.

భూసార పరీక్షలు ఇలా..

సాధారణ పొలంలో అయితే ఆరు అంగుళాల లోతు, చెరకు, అరటి లాంటి పొలాల్లో అయితే ఎనిమిది అంగుళాల లోతులో 'వి' ఆకారంలో పారతో కట్ చేసి, మట్టి నమూనా సేకరించాలి. ఇలా ప్రతి ఐదెకరాల ఒక మట్టి నమూనాను సేకరిస్తారు. మట్టి నమూనాతో పాటు రైతు పేరు, సర్వే నంబరు, విస్తీర్ణం, ముందు వేసిన పంట–వేయబోయే పంట, వినియోగించిన ఎరువుల వివరాలను పొందుపరుస్తారు. వీటిని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ (భూసార పరీక్షా కేంద్రానికి)కు తరలించి, పరీక్షలు నిర్వహిస్తారు. భూసార పరీక్ష అనంతరం సేంద్రియ కర్బనం, ఎలక్ట్రికల్ కండక్టవిటీ (ఈసీ), ఉదజని సూచిక (పీహెచ్), నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ మూలకాలు తదితర ధాతు లోపాలు కార్డుపై నమోదు చేసి రైతుకి అందిస్తారు. దీంతో లోపాలు సవరించేందుకు కార్డులో ఇచ్చిన ధాతువులు పొలంలో వేసుకుంటే భూమిలో సిరులు పండుతాయి. ఈపరీక్షలు ఖరీఫ్ సాగు ప్రారంభం నాటికి పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు.

విద్యాకానుక కిట్ల పరిశీలన

రౌతులపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యా కానుక కిట్లను సమగ్ర శిక్షా సీఎంఓ, ఐఈ కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షూలు, దుస్తులు సెంటీమీటర్ల వారీగా సరి చూసి ఏమైనా తేడాలు ఉంటే జేవీకే యాప్‌లో నమోదు చేయాలన్నారు. జేవీకే పంపిణీలో అప్రమత్తంగా ఉండాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఎంఈఓ ఎస్వీ నాయుడు ప్రధానోపాధ్యాయుడు కొండబాబు, సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది నాయుడు, శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

కోటనందూరు: నీటి సంరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ సూచించారు. మంగళవారం జగన్నాథపురం వెంకటాచలం చెరువు వద్ద ఉపాధి కూలీలు, గ్రామస్తులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఎన్విరాన్‌మెంట్ లైఫ్‌స్టైల్లో భాగంగా ప్రతీఒక్కరూ నీటిని, మొక్కలను సంరక్షించడంతో పాటు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని, ఎలక్ట్రానిక్ వస్తువుల రీసైక్లింగ్, ఆరోగ్యవంతమైన జీవనశైలి, దైనందిన జీవితంలో వ్యర్థాలు లేకుండా చూడడం, స్థిరమైన ఆహారపు అలవాట్లు అలవరుచుకోవాలన్నారు. భవిష్యత్తు తరాలకు పటిష్టమైన పర్యావరణాన్ని అందించాలంటే ఎన్విరాన్‌మెంట్ లైఫ్‌స్టైల్ ఎంతో ముఖ్యమన్నారు.

ప్రజలకు అండగా ప్రభుత్వం



మృతుని కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న రేలంగి రమణాగౌడ్

తుని: ప్రజలకు అండగా ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుందని వైఎస్సార్ సీపీ తుని పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్ అన్నారు. అమ్మాజీపేట సచివాలయంలో మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెంకె దేవుళ్లు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమాలో మంజూరైన రూ.5 లక్షల చెక్కును అందజేశారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో బాధిత కుటుంబానికి న్యాయం జరిగిందన్నారు. కౌన్సిలర్లు రేలంగి విజయ దుర్గ, మంతిన నాగలక్ష్మి, మాజీ కౌన్సిలర్ గోవిందరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయ ప్రధాన అర్చకునికి తీవ్ర అస్వస్థత

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆలయ ప్రధానార్చకులలో ఒకరైన కోట ఎల్‌వీఎస్ఎన్ శర్మ(శ్రీనివాస్) తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం మధ్యాహ్నం ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్‌తోపాటు ఫిట్స్ రావడంతో హుటాహుటిన ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడలోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఆయన దేవస్థానం ధర్మకర్తల మండలి కో–ఆప్షన్ సభ్యుడిగా కూడా ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

తుని: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తుని పట్టణంలో మసీదు కోసం స్థలం కేటాయించారని, నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా మంగళవారం తెలిపారు. కాకినాడలో ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ మైనార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తుని పట్టణంలో మసీదు, బెండపూడి శ్మశాన వాటిక, ఈద్గా స్థలానికి షెడ్డు ఏర్పాటుకు అవసరమైన నిధులను వక్ఫ్‌బోర్డు నుంచి మంజూరు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. మైనార్టీ నాయకులు షేక్ జిలానీ, షేక్ ఖలీల్, అన్వర్ వల్లీ పాల్గొన్నారు.

దళితులపై కేసు ఎత్తివేయాలి

ప్రత్తిపాడు రూరల్: వాకపల్లి మహాలక్ష్మి అమ్మవారి జాతరలో జరిగిన ఘటనలో దళితులపై పెట్టిన కేసును ఎత్తివేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగారాజు డిమాండ్ చేశారు. మంగళవారం వాకపల్లి దళితవాడలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ సభ్యులు పర్యటించారు. బంగారాజు మాట్లాడుతూ వాకపల్లి ఘటనలో అమాయకులను అరెస్టు చేశారన్నారు. లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాను కొండ లచ్చబాబు, చింతలూరు, పోతులూరు పార్టీ నాయకులు పాల్గొన్నారు.